ప్రజాశక్తి

గురువారం 20 జులై 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నాలుగేళ్లుగా నాన్చుడు

- ప్రహసనంగా టిడ్కో ఇళ్ల అప్పగింత
- గుంటూరులో ఒక్కఇల్లూ అప్పగించని అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



అడవి తక్కెళ్లపాడులో మౌలిక సదుపాయాలపై చర్చిస్తున్న టిడ్కో చైర్మన్

గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన టిడ్కో గృహాల అప్పగింత ప్రహసనంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 32 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టగా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు వివిధ దశలో ఉండగా ప్రభుత్వం మారింది. గత ప్రభుత్వ హయాంలో శ్లాబులు వేసి వదిలేయగా అంతర్గత పనులు, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నాలుగు ఏళ్లు సరిపోలేదు. ఇళ్ల అప్పగింతలో తీవ్ర జాప్యం కాగా మౌలిక సదుపాయాలు కూడా పూర్తిగా కల్పించలేకపోతున్నారు. దీంతో పేదవర్గాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

గుంటూరు జిల్లాలో అడవితక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలో గుంటూరు నగర వాసులకు 7472 గృహాలను నిర్మించాలని ప్రతిపాదించారు. వీటిల్లో ఒక్కటి కూడా ఇంతవరకు లబ్ధిదారులకు అప్పగించలేదు. తెనాలిలో చినరావూరు, పూలేకాలనీలో1856 ఇళ్ల నిర్మాణం చేపట్టగా ఇప్పటివరకు 848 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. పూలేకాలనీలో 1008 ఇళ్లకు సంబంధించి పనులు ఇంకాపూర్తి కాలేదు. మౌలిక సదుపాయాల కల్పన పనులు ప్రారంభం కాలేదు. మంగళగిరిలో 1728 ఇళ్లు అప్పగించినా తాగునీటి సమస్య వెంటాడుతోంది. రాజధానిలో నిడమర్రు, నవులూరు, పెనుమాక, అనంతవరం, మందడడం, తుళ్లూరు, దొండపాడు, ఐనవోలులో మొత్తం 6384 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 5024 లబ్ధిదారులకు అప్పగించినట్టు అధికారులు తెలిపారు. ఇంకా 1360 పెండింగ్‌లో ఉన్నాయి. పొన్నూరులో నిడుబ్రోలులో 2368 ఇళ్లకు గాను 1456 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. గుంటూరులో ఇళ్ల

2లో

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. బుధవారం బ్రాడిపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.నళినీకాంత్ అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. బాబురావు మాట్లాడుతూ 60 ఏళ్ల నుండి గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం ఆందోళన జరుగు తున్నా పాలకులు పట్టించుకోవట్లేదన్నారు. ఈ చానల్‌ను విస్తరిస్తే 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రభుత్వం నిధులు కేటాయించకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామ న్నారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రజల మధ్య విభజన సృష్టించేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో యునిఫాం కామన్ సివిల్ కోడ్ పేరుతో ప్రజల మధ్య విభజన రేఖ సృష్టించే ప్రయత్నం చేస్తోంద న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా నిత్యావసర ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రజలకు సరిపడా ఉపాధి లేక జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయని అన్నారు. లాభాలు ఆర్జించే ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పోరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అప్పగిస్తోందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని, పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 20 వేల కుటుంబాలు, ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా నివాసము ఒంటున్నాయని, వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఇ.అప్పారావు, ఎస్-ఎస్.చెంగయ్య, ఎం.రవి, నాయకులు అరుణ, బి.వెంకటేశ్వర్లు, ఎంఎ చిష్టీ పాల్గొన్నారు.

ఎఎన్‌యులో 8 మంది ప్రొఫెసర్ల తొలగింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనవర్సిటీలో 8 మంది ప్రొఫెసర్లను తొలగిస్తూ బుధవారం జరిగిన పాలకమండలి సమావేశం నిర్ణయం తీసుకుంది. గతంలో వేసిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన అధ్యాపకులు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు పొందారని కొందరు కోర్టును ఆశ్రయించగా కోర్టు గత నోటిఫికేషన్ కొట్టివేసింది. దీంతో వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో ఒకరు బయట కళాశాల నుండి వర్సిటీ వచ్చినవారు కాగా మిగతా ఏడుగురు వర్సిటీలో ఉద్యోగాలు చేస్తూ తర్వాత ఇచ్చిన నోటిఫికేషన్‌లో ప్రొఫెసర్లుగా పోస్టింగులు పొందిన వారే. గత ఉద్యోగాలపై ప్రభుత్వ నిర్ణయం తీసుకొని ఆ మేరకు ఆలోచించాలని పాలకమండలి నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే వారు పాత ఉద్యోగాలలో కొనసాగే అవకాశం ఉంది. గతంలో క్యాష్ ప్రమోషన్లు పొందని వారిలో ఎవరైనా అర్హులుంటే వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. నూతన నియామకాల్లో పాటించాల్సిన విధి విధానాలపైన సమావేశంలో చర్చించినట్లు తెలిసింది.

మిర్చి యార్డు చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ

- ఎట్టకేలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పంతం నెగ్గించుకున్న మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా వైసిపి నాయకుడు నిమ్మకాయల రాజనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యార్డు గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, వైస్ చైర్మన్‌గా షేక్ మాబూ సుభానీ, డైరెక్టర్లుగా పల్లా శ్రీనివాసరావు, మహ్మద్ ఫరూక్, కోటా గంగాభవానీ, కోలా అన్నపూర్ణ, కొండారెడ్డి నాగలక్ష్మీ, కొప్పుల విజయ మాధవి, పి.సుశీల, షేక్ సలీమ, బి.వెంకటేశ్వరరావు, గుంజర ప్రభుదాసు, ఎం.సతీష్‌కుమార్, గుడివాడ అరుణ, కొత్తపల్లి శివసాంబిరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ భాగ్యలక్ష్మీ నియమితులయ్యారు. నూతన చైర్మన్ రాజనారాయణ, డైరెక్టర్లకు

2లో



రాజనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదరావు తదితరులు

వేలంవెర్రిగా వజ్రాల వేట

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి బసవమ్మ వాగు సమీపంలో వజ్రాలు దొరుకుతున్నాయనే వదంతులతో పలు ప్రాంతాల నుండి జనం కుటుంబ సమేతంగా వచ్చి వెదుకులాడుతున్నారు. పిల్లలను పాఠశాలలు మాన్పించి మరీ వజ్రాలు వెతికేందుకు తీసుకొచ్చేవారు కొందరైతే

2లో





విద్యార్థులు, పసిపిల్లతో వచ్చి వెదుకుతున్న జనం, అక్కడే భోజనాలు.. వెదుకులాట ప్రదేశంలో ఐస్‌క్రీమ్ బండ్లు

గుంటూరులో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులోని రైతుబజార్లు, కూరగాయల మార్కెట్‌లను విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. చుట్టుగుంట, బృందావన్ గార్డెన్స్‌లోని రైతు బజార్లు, గాంధీపార్క్ సెంటర్‌లో కూరగాయల మార్కెట్‌లో విజిలెన్స్, తూనికలు-కొలతల శాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించి, తూనికల్లో వ్యత్యాసం, సరైన స్టాంపింగ్ లేని పరికాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.



కార్మికులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక సిసిఎల్ కాఫీ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కార్మికులపై పెట్టిన కేసును కోర్టు కొట్టి వేసినది. 2018లో కార్మికులు వేతనాల విషయమై పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కార్మికులపై కేసు నమోదు చేయగా ఐదేళ్ల తర్వాత బుధవారం రెండవ అదనపు మెజిస్ట్రేట్ కేసును కొట్టివేశారు.

ఎన్‌జిజిఒ కాలనీలో సిసి రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక 28వ డివిజన్‌లోని యన్.జి.ఓ కాలనీ, 4 వ లైనులో రూ.40 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నగరంలో పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు వారి డివిజన్లలో గుర్తించిన సమస్యలు, ప్రజా అవసరాల దృష్ట్యా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో గుంటూరుని గుంతలూరుగా మార్చారని విమర్శించారు. నూతన కౌన్సిల్ ఏర్పడ్డాక నగరంలో అభివృద్ధి పనులు ఎంతో వేగవంతంగా జరుగుతున్నా యన్నారు. ప్రస్తుతం యన్.జి.ఓ కాలనీలో నిర్మిస్తున్న సి.సి రోడ్డును గత ప్రభుత్వాల నిర్లక్ష్యం చేశాయన్నారు. తమ ప్రభుత్వం ప్రజావసరాల దష్ట్యా ప్రాధాన్యత క్రమంలో పనులు నిర్వహిస్తున్నామని తెలియచేశారు. కార్యక్రమంలో స్థానిక కోర్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌పై రేపు సమావేశం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించుటకు నిధుల సాధనకు చేసిన పోరాట సమీక్ష, మరియు భవిష్యత్ కార్యక్రమం గురించి చర్చించుటకు నల్లమడ రైతు సంఘ సమావేశం ఏర్పాటు చేసినట్లు సంఘ అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పెదనందిపాడులో కొల్లా వెంకయ్య గ్రంధాలయంలో నిర్వహించే సమావేశంలో రైతులంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఇరిగేషన్ ఎఇగా సుధాకర్‌రావు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల ఇరిగేషన్ ఎఇగా పేట సుధాకర్‌రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకూ బుగ్గ వాగు డ్యామ్ వద్ద పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. తన పరిధిలో కంభంపాడు మేజరు, పాలువాయి మేజర్, దశ బంద్ కాల్వ, గొట్టిముక్కల మైనర్లు ఉంటాయని, నాలుగు మేజర్ల కింద 25525 ఎకరాల ఆయకట్టు ఉందని ఆయన చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు.

పింఛన్లు, కార్డులపై నిలదీత

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని ఎండుగుంపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పెన్షన్లు, రేషన్ కార్డులు అంశంలో వాలంటీర్ల తీరుపై గ్రామానికి చెందిన గట్నేని రమేష్ అధికారులను ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరిస్తామని జెడ్‌పిటిసి కె.మస్తాన్‌రావు తెలిపారు. ఎంపిపి టి.రాణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుపై భూ కబ్జా ఆరోపణలు

- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు
- నాలుగు వారాలకు విచారణ వాయిదా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వినుకొండ మండలం బ్రాహ్మణపల్లిలో 175 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి తద్వారా రూ.50 కోట్ల బ్యాంకు రుణం పొందడంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. మాల్యాద్రి ఆగ్రోటెక్, శ్రీవత్సవ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీల ద్వారా వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ మార్గాల విక్రయ పత్రాలు సృష్టించి తద్వారా బ్యాంకు రుణం పొందారని వినుకొండకు చెందిన కీర్తిపాటి వెంకటేశ్వర్లు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరపున ప్రముఖ న్యాయవాది జడా శ్రవణ్ కుమార్ వాదించారు. వందలాది ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి తద్వారా ప్రజాధనాన్ని కొల్లగొట్టి బ్యాంకు నుంచి రుణం పొందారని న్యాయవాది శ్రవణ్ కుమార్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేష సాయి, జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం విచారణకు స్వీకరించి ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయవలసిందిగా ఆదేశించారు. విచారణను 4 వారాలకు వాయిదా వేశారు.

డ్రైనేజి సమస్యపై స్పందించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 34 వ డివిజన్‌లో సుబ్బారెడ్డి నగర్ వై.జంక్షన్ వద్ద డ్రెయినేజి సమస్యపై కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం కోరారు. సుబ్బారెడ్డి నగర్ ప్రజలు ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. అండర్ డ్రెయినేజీ కాల్వ మురికి నీరంతా సుబ్బారెడ్డి నగర్‌లోకి వస్తున్న విషయంపై అధికారులతో చర్చిస్తానన్నారు. ఆయనవెంట 34 వార్డు వైసిపి ప్రెసిడెంట్ పటాన్ సైదాఖాన్, ఎస్‌సి సెల్ నాయకులు ప్రభు ఉన్నారు.



టిడిపి ఆధ్వర్యంలో ఇంటిగ్రేటడ్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఓటర్ పరిశీలనలో బూత్ లెవెల్ ఏజెంట్లు జాగ్రత్త వహించాలని టిడిపి కార్యకర్తలను నాయకులు ఆదేశించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కొల్లిపర, తెనాలి మండలాల బూత్ లెవెల్ ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కొల్లిపర మండలం మధ్యానం నుండి సాయంత్రం వరకు తెనాలి మండల బూత్ ఎజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ వెరిఫ్ కేషన్ జులై 21 నుండి బిఎల్వోలు ఇంటింటికీ వెళ్లి చేసే ప్రక్రియలో టిడిపి తరుపు నుండి బూత్ ఏజంట్లు కూడా పాల్గొనే విధంగా ప్రతి బూత్ ఏజెంట్‌కు నియోజకవర్గ ఇంచార్జీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సంతకంతో ఉన్న గుర్తింపు కార్డు ఇస్తామని ఐ టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్ తెలిపారు. పరిశీలన సందర్భంలో గ్రామ వాలంటీర్లు ఎవరు జోక్యం చేసుకున్నా బూత్ ఏజెంట్ అభ్యంతరం తెలపవచ్చని, డెత్, డబుల్ ఎంట్రీ, దొంగ ఓట్ల విషయంలో జాగ్రత్త పాటించాలని చెప్పారు. ఒక డోర్ నంబర్ మీద ఎన్ని ఓట్లు ఉన్నా అవన్నీ ఒకే బూత్ లో ఉండే విధంగా బిఎల్వోతో సరి చేయించాలని సూచించారు. ఐటిడిపి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి రేణుక మాట్లాడుతూ టిడిపి యాప్‌ను ప్రతి కార్యకర్త తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఎంతమంది యక్టివ్‌గా ఉన్నారో నేరుగా పార్టీ అధినేత చంద్రబాబు పర్యవేక్షిస్తారని తెలిపారు. క్లస్టర్/యూనిట్ ఇంచార్జీలు , బూత్ కన్వీనర్లు పార్టీ రూపొందించిన టెలిగ్రామ్ లోని మై టిడిపి బాట్ లో ప్రతి ఇంటికి వెళ్లి అందులో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కొల్లిపర, తెనాలి మండల టిడిపి అధ్యక్షులు చిన్న కోటిరెడ్డి, కేశన కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, నాయకులు లక్ష్మీ గణేష్, రావి సూర్య తేజ, వంగా సాంబిరెడ్డి పాల్గొన్నారు.



తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

జగన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసలకు నిరసనగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం అధ్యక్షురాలు దాసరి జ్యోతి ఆధ్వర్యంలో నగరంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని).తదితరులుపాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ 19వ డివిజన్ అధ్యక్షులు రాళ్లబండి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుకి గ్యారంటీ మినీ మ్యానిఫెస్టోపై ప్రచారంనిర్వహించారు. కోవెలమూడి రవీంద్ర ప్రసంగిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి మేలు జరుగుతుందన్నారు.

సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, వైసిపి నాయకులు నూరి ఫాతిమా బుధవారం పలు అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 8వవార్డులోని క్రిస్టియన్ పేటలో రూ.20 లక్షల వ్యయంతో 3 సిసి రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. అభివద్ధి విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు కాదు కదా కనీసం సైడ్ కాలువలు కూడా వేసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తాను ఇరవై నాలుగు గంటలూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటరు ఇర్రి ధనలక్ష్మి, ఇర్రి సాయి, వార్డు ప్రెసిడెంట్ కిషోర్ బాబు, పార్టీ నాయకులు గులాం రసూల్ ఏలిక శ్రీకాంత్, తోట ఆంజనేయులు, ఎర్రబాబు, బి. రవి, ప్రదీప్, వినోద్, వార్డు కన్వీనర్ సాగర్, వసుమతి, భాను, మాధవి, సాంబ, రణప్రతాప్, గుమ్మా గోపి పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా నాన్చుడు

(మొదటి పేజీ తరువాయి)

అప్పగింతకు కార్పొరేషన్ అధికారులు మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్షంగా వ్యవహరించడమేనన్న విమర్శలు లేకపోలేదు. తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లు, మురుగు కాల్వల ఏర్పాటులోనూ జాప్యమైంది. కాలనీలోని ఇళ్లలో అంతర్గత పనులు నాణ్యత లేదనే విమర్శలు వచ్చాయి. అడవి తక్కెళ్లపాడులో 4192 ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అప్పగిస్తామని టిడ్కో అధికారులు చెబుతున్నారు. మరోవైపు టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించే ప్రక్రియ పూర్తి కాలేదు.

సమన్వయంతో పనిచేయాలి : టిడ్కో చైర్మన్

మెప్మా, లీడ్ బ్యాంకు అధికారులు, టిడ్కో అధికారులు సమన్వయంతో రుణాలు మంజూరు చేయాలని టిడ్కో చైర్మన్ జె. ప్రసన్నకుమార్ ఆదేశించారు. బుధవారం అడవి తక్కెళ్లపాడు గృహ సముదాయాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరలో గృహాలను అందజేయాలన్నారు. మౌలిక సదుపాయల కల్పనలో జాప్యం తగదన్నారు. రాష్ట్రంలో వచ్చే రెండునెలలో 31,090 గృహాలను అందించేందుకు కార్యచరణ రూపొందించినట్లు మీడియాకు తెలిపారు. అడవితక్కెళ్లపాడులో ఈనెలాఖరుకు గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. వెంగళాయపాలెంలో పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. గృహాలను ఆగస్టులో లబ్ధిదారులకు అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.

మిర్చి యార్డు చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, వైసిపి నాయకులు తాడిశెట్టి మురళీ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రాజనారాయణను యార్డు చైర్మన్‌గా మంత్రి అంబటి రాంబాబు సిఎంకు సిఫార్సు చేయగా గుంటూరుకు చెందిన వైసిపి నాయకులు పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియ ప్రభుత్వం ఉత్తర్వుల జారీతో ముగిసింది. వైసిపిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మంత్రి అంబటి రాంబాబు రెండు గ్రూపులుగా జిల్లా నాయకులు విడిపోతున్నారు. మంత్రి అంబటి రాంబాబు గుంటూరుపై కూడా క్రమంగా పట్టు సాధిస్తున్నారు. గుంటూరుకు చెందిన రాజనారాయణకు ఈ పదవి ఇప్పించడం ద్వారా సత్తెనపల్లి నియోజకవర్గంలో అధికంగా ఉన్న బిసిలను తన వైపునకు తిప్పుకోవాలనే ప్రయత్నంలో మంత్రి అంబటి ఉన్నారు. రాజనారాయణ నియామకాన్ని అడ్డుకోవాలనే అప్పిరెడ్డి గ్రూపు ప్రయత్నాలు విఫలమయ్యాయి.



వేలంవెర్రిగా వజ్రాల వేట

(మొదటి పేజీ తరువాయి)

చట్టి బిడ్డలను చంకనేసుకుని వచ్చేవారు మరికొందరు. వీరంతా భోజనాల క్యారేజీలు తెచ్చుకుని మరీ ఉదయం నుండి సాయంత్రం వరకూ వజ్రాల వేటలో నిమగ్నమవుతున్నారు. వినుకొండ, చిలకలూరిపేట, పెదకూరపాడు, పిడుగురాళ్ల, మాచర్ల తదితర ప్రాంతల నుండి తండోపతండాలుగా వస్తున్నారు. సత్తెనపల్లి ప్రాంతంలో ఎక్కడ ఎర్రమట్టి కనపడినా అక్కడ వజ్రాల కోసం వెదుకుతున్నారు. కొడవళ్లు, ఇనుప కడ్డీలతో తవ్వుతూ అంగుళం అంగుళం గాలిస్తున్నారు. మరోవైపు రోజురోజుకూ జనం పెరుగుతుండడంతో ఆ ప్రాంతమంతా తిరునాళ్లను తలపిస్తోంది. వీధి విక్రేతలు సైతం వ్యాపారం కోసం వస్తున్నారు. రహదార్ల వెంట ఐస్ క్రిమ్, సోడాబండ్లు వెలిశాయి.

బాధితుల సమస్యలు ఓపికతో విని పరిష్కరించాలి

నేర సమీక్షా సమావేశంలో పల్నాడు జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ



ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

పెండింగ్ కేసులలో పురోగతి సాధించి కేసుల సంఖ్య తగ్గించాలని, పోలీస్ స్టేషన్ లను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్పి రవిశంకర్‌రెడ్డి పోలీస్ అధికారులకు సూచించారు. పల్నాడు జిల్లా పోలీస్ అధికారులతో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతిస్పందించి తగు చర్యలు తీసుకోవాలని, వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి గాని సిబ్బంది గాని ఉండేటట్లుగా చూసుకోవాలని సూచించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి, పోర్టల్ లో డాక్యు మెంట్లను అప్లోడ్ చేయాలన్నారు. పోక్సో కేసులు, మహిళల పై జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసులు మొదలైన కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని మరియు సదరు నేరాలు అరికట్టే విధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండే విధంగాసదస్సు ఏర్పాటు చేయాలని, వేగ నియంత్రకాలు, ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులను, అవసరమైన చోట స్టాప్ బోర్డు ను ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ప్రతిరోజు రైడ్ లు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి వారిని పూర్తిస్థాయిలో కట్టడి చేస్తే నేరాలు కూడా తగ్గే అవకాశం ఉంటుందన్నారు. స్పందన పిటిషన్లు,పోక్సో, గ్రేవ్, ప్రాపర్టీ, చీటింగ్ కేసులు, 174 సి.ఆర్ పిసి, మిస్సింగ్ కేసులు, గంజాయి, నాటుసారా ల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రౌడీలు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని వారి ప్రవర్తన ఎలా ఉంది, వారు కొత్త వ్యక్తులను ఎవరినైనా కలుస్తున్నారా, ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉంటుందా వంటి సమాచారాన్ని సేకరించాలన్నారు. పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకుని వెళుతున్న వాహనాలు ప్రమాదాలకు గురి అవుతున్నాయని నివారణకు ట్రాక్టర్, ఆటో, వ్యాన్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అప్పటికి వారి ప్రవర్తనలో మార్పు రాకుంటే చలానాలు విధించాలని, అవసరమైతే వాహనాన్ని సీజ్ చెయ్యాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాల పై కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో తీసు కుంటున్న పటిష్ట చర్యలవలన చాలా వరకు గంజాయి అక్రమ రవాణాను నిరోధించగలిగామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, క్రయ విక్రయాలు పై నిఘా వుంచి వాటిని అరికట్టాలని, ఆ ప్రదేశాలలో కార్డన్ అండ్ సెర్చ్ లు, రైడ్ లు నిర్వహించాలన్నారు. గతంలో నాటుసారా సంబంధిత కేసులలో బైండోవర్ చేసిన వ్యక్తులు మరల పట్టుపడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పి డి.రామచంద్ర రాజు, క్రైమ్ అదనపు ఎస్పి షేక్. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆక్రమించిన ఇంటిని తిరిగి వికలాంగుడికి అప్పగింత

ప్రజాశక్తి-నాదెండ్ల



మండలంలోని కనపర్రులో ఇరవై ఐదేళ్ల నుంచి నివాసం ఉం టున్న వికలాంగుడు జెట్టిపాటి కోటేశ్వరరావు ఇంటిని వైసిపి నాయకుడు గుంజి శ్రీనివాస రావు, అతని అను చరులు బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఇంటికి తాళం వేసి అతన్ని బయటకు గెంటేశారు. కోటేశ్వర రావు భార్య రమణ తనకు బాకీ ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తూ, వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో నాదెండ్ల మండలం తెలుగుదేశం పార్టీ, కనపర్రు టిడిపి నాయకులు, టిడిపి వికలాంగుల విభాగం కోటేశ్వరరావుకు అండగా ఉండటంతో ఈ విషయమై అధికారులు,కలెక్టర్, ఎస్పీ విచారణ చేశారు. ఆక్రమించుకున్న ఇంటిని కోటేశ్వర రావుకి అధికారుల సమక్షంలో బుధవారం అప్పగించారు.

మహిళను వెంబడించి బ్యాగ్ చోరీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని రామలింగేశ్వర పేటకు చెందిన మహిళ గూడూరు సంపూర్ణ ఈ నెల 14న దంత వైద్యశాలకు వెళ్లి తిరిగి సైకిల్ పై ఇంటికి వెళుతుండగా ఇరువురి యువకులు, రామలింగేశ్వరపేట మూడు బొమ్మల సెంటర్‌లో ఆమెను అటకాయించారు. సైకిల్ ముందువైపు ఉన్న బాస్కెట్ లో బ్యాగును అపహరించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బుధవారం పట్టణ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాల అమలే ధ్యేయం

ఎంపీపీ చౌడేశ్వరి

ప్రజాశక్తి-రెంటచింతల

ప్రభుత్వ యంత్రాంగం నేరుగా ఇంటికి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేయడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు.

మండలంలోని పసర్లపాడులో బుధవారం నిర్వహించిన సభకు సర్పంచ్ వట్టెంకుంట లక్ష్మమ్మ అధ్యక్షత వహించారు. సురక్ష పథకం వలన రోజులు తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే అవకాశం లేదన్నారు. 152 మందికి అవసరమైన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.పుల్లారావు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెన్న వెంకటేశ్వర్ రెడ్డి బ్రహ్మారెడ్డి సీతారామరెడ్డి ఇఒపిఆర్డి రామ చంద్రరావు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేంద్ర రెడ్డి సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 35,689
మిర్చి ఎగుమతి	: 34,771
మిర్చి నిల్వ	: 12,721

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 23,500
నెం.5	13,000 - 19,000
273	14,000 - 18,800
341	11,000 - 24,000
సూపర్ 10	18,500 - 19,800
నాన్ ఏసి	
తేజ	9,500 - 24,000
బడిగి	10,000 - 25,500
దేవనూరు డీలక్స్	14,000 - 20,500
తాలుకాయలు	5,000 -14,000
ఏసి	
334	15,500 - 21,200
నెం.5	18,000 - 18,000
341	11,000 - 21,000
తేజ	10,000 - 23,500
బడిగి	15,500 - 26,000
దేవనూరు డీలక్స్	21,000 - 21,500
తాలుకాయలు	6,000 -13,000



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, ఎంపిటిసిలు

మంత్రి రాంబాబుకు వ్యతిరేకంగా అసమ్మతి నాయకుల రహస్య సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మంత్రి అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా అసమ్మతి నాయకులు బుధవారం రహస్యంగ సమావేశమయ్యారు. 11 మంది సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపిటీసిలు అసమ్మతి నేత చిట్టా విజయభాస్కరరెడ్డి ఇంట్లో సమావేశమయ్యారు. తమను మంత్రి అంబటి రాంబాబు పట్టించుకోవటం లేదని, ప్రజాప్రతినిధులైన మిమల్నీ విస్మరించి మంత్రి అనుచరులే పెత్తనం చేస్తున్నారని విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. రెండ్రోజుల్లో మరోసారి సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆయన చెప్పారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

రక్తహీనత ఉన్న మహిళల్ని గుర్తించండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

స్థిరమైన అభివృధి లక్ష్యాల సాధన విషయంలో పల్నాడు జిల్లాను ముందు వరుసలో ఉండేలా ఐసిడిఎస్ సిబ్బంది పని చేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. బుధవారం నరసరావుపేట కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాలులో సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి సంపూర్ణ వివరాలు సేకరించాలని, రక్త హీనత ఉన్న మహిళలను గుర్తించి వారికి అవసరమైన హాట్ కుక్కుడ్ మీల్స్ అదేవిధంగా చూడాలని చెప్పారు. బరువు తక్కువుగా ఉన్న పిల్లలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణను అందిచాలన్నారు. జిల్లాలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు 2249 మంది ఉన్నారని, ఎదుగుదల తక్కువుగా ఉన్న పిల్లలు 3468 మంది ఉన్నారని, వీరికి సకాలంలో పోషక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. నాడు-నేడు కింద నిర్మాణంలో ఉన్న 13 అంగన్వాడీ కేంద్రాల పురోగతిపై వివరాలడిగారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థిరమైన అభివృధి లక్ష్యాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించారు. సిడిపిఒ ఉమామహేశ్వరీ, వైద్యారోగ్య శాఖ నుండి డాక్టర్ నాగపద్మజ పాల్గొన్నారు.

నర్సరీ చట్ట నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - వినుకొండ : నర్సరీ చట్టం నిబంధనలను నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖాధికారి షేక్ నబి రసూల్ అన్నారు. బొల్లాపల్లి మండలంలోని మేళ్లవాగు, రెడ్డిపాలెం పరిధిలో షేడ్ నెట్ నర్సరీలను బుధవారం పరిశీలించారు. నర్సరీ చట్టం 2010 ప్రకారం నర్సరీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. షేడ్ నెట్ చుట్టూ 9-14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్టుతో రక్షణ కల్పించాలని, షేడ్ నెట్ హౌస్‌లో డబుల్ డోర్ సిస్టం కలిగి ఉండాలని చెప్పారు. షేడ్ నెట్ హౌస్‌లో పైన ఉన్న నెట్‌కు గాని ఇన్సెక్ట్ నెట్‌కు గాని కీటకాలు లోపల ప్రవేశించకుండా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలన్నారు. నర్సరీ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తనాన్ని కొనుగోలు చేసినప్పుడు ఒరిజినల్ రసీదులను భద్రపరచుకుని నర్సరీ రిజిస్టర్‌లలో నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు నాసిరకం నారు అమ్మినా, అధిక ధరలు వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని నర్సరీలకు నోటీసులిచ్చారు.

మద్దతు లేకుండా సాగు ఎలా?

- తృణ ధాన్యాల సాగుకు మాటల్లోనే ప్రోత్సాహం
- ధరలు, మార్కెటింగ్‌పై భరోసా ఇవ్వని ప్రభుత్వాలు
- ఒకప్పుడు ప్రధాన పంటలు ఇప్పుడు కనుమరుగు
- మార్కెట్‌లో ధరలున్నా రైతుల్లో అనాసక్తి

ప్రజాశక్తి - చిలకలూరిపేట



కావూరులో సాగుకు సిద్ధం చేసిన పొలం



కొన్ని ఆహార, వాణిజ్య పంటలకు మద్దతు ధరలను అరకొరగానైనా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తృణ ధాన్యాలను మాత్రం విస్మరించింది. మరోవైపు వాటి సాగును ప్రోత్సహించాలని మాత్రం ప్రధాని పిలుపునిచ్చారు. పలు ఆరోగ్య కారణాల రీత్యా తృణ ధాన్యాలైన ఆరిగెలు, కొర్రలు, సాములు, ఊదలు, సజ్జలు, జొన్నలకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రాగులు రూ.45, సాములు రూ.110, ఊదలు రూ.85, కొర్రలు రూ.80, అంటు కొర్రలు రూ.280, ఆరిగెలు రూ.85, జొన్నలు రూ.75, సజ్జలు రూ.40 వరకు ధర పలుకుతున్నాయి.

రెండేళ్ల క్రితం వరకు కూడా..

చిలకలూరిపేట మండలంలో ఒకప్పుడు తృణ ధాన్యాల సాగు అధికమే అయినా ప్రస్తుతం పూర్తిగా తగ్గిపోయింది. పత్తి, మిర్చి తదితర పంటలు సాగు అధికంగా లేని కాలంలో ఎక్కువ విస్తీర్ణంలో తృణ ధాన్యాలే సాగయ్యాయి. కావూరు, లింగంగుంట్ల, కమ్మ వారిపాలెం తదితర గ్రామాల్లో సజ్జలు, రాగులు, జొన్నలు, ఆరిగెలను రెండేళ్ల కిందట వరకూ సాగు చేశారు. రెండేళ్ల కిందట మండల వ్యాప్తంగా 150-170 ఎకరాల్లో తృణ ధాన్యాలు సాగయ్యాయి. అయితే సరైన ధరలు, మార్కెట్, నిల్వకు గిడ్డంకుల సదుపాయం లేకపోవడం తదితర కారణాలతో దాదాపు తృణ ధాన్యాల సాగు కనుమరుగైంది.

పెట్టుబడి తక్కువే

కొద్దిపాటి పెట్టుబడి, కొద్దిపాటి నీటి వనరులతో తృణ ధాన్యాలను సాగు చేసే వీలుంది. దీనికితోడు ఇవి స్వల్ప కాలిక పంటలు కావడంతో వీటి పంట కాలం పూర్తయిన వెంటనే శనగ, పొగాకు, మొక్కజొన్న తదితర పంటల సాగుకూ అవకాశం ఉంది. తృణ ధాన్యాల సాగును సాధారణంగా జులై, ఆగస్టు నెలల్లో ప్రారంభించొచ్చు. పంట రకం ఆధారంగా 70 రోజుల నుండి 120 రోజుల వరకూ పంట కాలం ఉంటుంది. తెగుళ్లు తక్కువ కావడం వల్ల పెట్టుబడి ఖర్చుకూడా తక్కు వగానే ఉంటుంది. గతంలో రెండుసార్లు సాళ్లు దున్ని విత్తనాలు వేయడానికి, పంట నూర్పిడే ప్రధాన ఖర్చుగా ఉండేది.

సాగు, దిగుబడి ఎలా

రాగుల సాగుకు ఒక ఎకరాకు 3 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. దిగుబడి 12-14 క్వింటాళ్ల వరకూ ఉంటుంది. ఈ పంట సాగుకాలం 120 రోజుల వరకు ఉంటుంది. కొర్రలు పంట కాలం 80 రోజుల వరకు ఉంటుంది. ఎకరాకు రెండు కిలోల విత్తనాలు సరిపోతాయి. వెద పద్ధతిలో అయితే నాలుగైదు కిలోలు అవసరం. దిగుబడి ఏడెనిమిది క్వింటాళ్ల వరకు ఉంటుంది. ఊదలు ఎకరాకు మూడు కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. దిగుబడి ఐదారు క్వింటాళ్ల వరకు ఉంటుంది. ఆరిగెలు, సాములు, సజ్జలు పంటల సాగుకు ఎకరాకు రెండు కిలోల వరకూ విత్తనాలు అవసరం కాగా దిగుబడి సుమారుగా 6-10 క్వింటాళ్ల వరకు ఉంటుంది.

మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో నెలలో చేరిన నెమ్ము తృణ ధాన్యాల సాగుకు సరిపోతుంది. భూసార పరీక్షల ఆధారంగా ఏ నేలలో ఏ పంటలు సాగు చేయెచ్చో రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తే సాగుకు తాము సిద్ధంగా ఉన్నామని పలువురు రైతులు చెబుతున్నారు. అయితే ప్రోత్సాహకాలు, తెగుళ్ల నివారణ చర్యలు, పంటల బీమా మద్దతు ధర, మార్కెట్ సదుపాయం తదితర అంశాల్లో ప్రభుత్వాలు దన్నుగా నిలిస్తేనే తృణ ధాన్యాల సాగు పెరుగుతుందని రైతులంటున్నారు.

గొడవలకు కారణం టిడిపియే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



ఘర్షణలపై టిడిపి జిల్లా అధ్యక్షులు చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఖండించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటి ఆక్రమణ విషయంలో బాధితులు చల్లా సుబ్బారావును ప్రశ్నిస్తే తిరిగి వారిపై దాడులు చేసి వివాదానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు దాడి చేస్తున్న వీడియోలలో వచ్చిన ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. టిడిపి దాడులను ప్రతిఘటించేందుకు సిద్ధమైన వైసిపి వారిని అడ్డుకొని పార్టీ కార్యాలయం వద్దకు వెళ్లాలని తాను ఆదేశించినట్లు చెప్పారు. పట్టణానికి చెందిన ఒక వ్యక్తి రూ.15 కోట్లకు పైగా ఐపి పెడితే వారి ఆస్తులు అమ్మి ప్రతి బాధితునికి 70 శాతం పంపిణీ చేశామన్నారు. కొల్లా సాంబశివరావు చేసిన ఆరోపణలో నిజం లేదన్నారు. ఘటనకు కారణమైన ఇంటిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని బాధితులు ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. దాడి ఘటనలో స్వయంగా డాక్టర్ చదలవాడ కర్ర తీసు కొని దాడిలో పాల్గొనడం తగదన్నారు. ఘర్షణలకు పాల్పడిన వారు ఏ పార్టీవారైనా నిష్పక్షపాతంగా కేసులు నమోదుకు ఎస్పీకి సూచించామని అయితే పోలీసు వ్యవస్థ పైనే టిడిపి ఆరోపణలు సరికాదని అన్నారు.

పరువునష్టం దావా వేసి పరిహారం కట్టిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ



తనపై వ్యాజ్యం వేసి నష్టపరిచిన వారిపై పరునష్టదావా వేసి పరిహారం కట్టిస్తానని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఆయన వద్ద 175 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, 53 కోట్లు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రుణం పొందారనే వార్తలపై ఆయన స్పందిస్తూ స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. తన వద్ద ఒక్క సెంటు భూమి కూడా ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిరూపించినా దాన్ని వదిలేస్తానని, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో తనకు తన కుటుంబ సభ్యులకు ఖాతా కూడా లేదని అన్నారు. 2016 టిడిపి హయాంలో తాను మూల్పూరి ఆగ్రోటెక్ వద్ద నుండి భూమిని కొన్నానని, దానిలో ఒక సెంటు కూడా ప్రభుత్వ భూమి లేదన్నారు. ప్రభుత్వ భూములను ఓవర్సీస్ బ్యాంకులో పెట్టి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు రుణం పొందాడని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజావ్యాజ్యం వెనుక ప్రతిపక్షాల కుట్ర ఉందని, అమయకుతో పిల్ వేయించకుండా దమ్ముంటే వారే వేయాలని అన్నారు. వినుకొండలో స్టేడియం, షాపింగ్ కాంప్లెక్స్, ఆస్పత్రి, రైతు బజారు ఇలా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష నాయకుడు కోర్టులో కేసులు వేయించి అడ్డుకుంటున్నారని, తాను త్వరలో నిర్మించే గుడి, మైనారిటీ కాలేజీ, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లనూ అడ్డుకుంటారని జీవీ ఆంజనేయులుపై విమర్శలు గుప్పించారు.

కార్మిక నాయకులకు సత్కారం

ప్రజాశక్తి - మాచర్ల



ఎన్.లక్ష్మయ్య, వెంకట్ రమణ మూడు దశాబ్దాల కార్మిక జీవితంలో కార్మికులు సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ, సిఐటియు నాయకులు కె.బాబూప్రసాద్ అన్నారు. స్థానిక కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ రిటైర్ అయిన సిఐటియు నాయకులు, కెసిపి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్.లక్ష్మయ్య, సిఐటియు నాయకులు వెంకట్ రమణను సిఐటియు కార్యాలయంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబూప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మయ్య మూడు దశాబ్దాల ఉద్యోగ ప్రయాణంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, అన్నిటిని తట్టుకొని తనతో పాటు మిగతా కార్మికుల సమస్యలపై పోరాడారని చెప్పారు. లక్ష్మయ్యను ఎన్నో విధాలుగా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేసినా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని అభినందించారు. నిరుపేద వర్గానికి చెందిన వెంకటరమణ ఎన్నో ఇబ్బందులకు తట్టుకుని కార్మికుల కోసం నిలబడ్డారని, సిఐటియులో పని చేశారని అన్నారు. రిటైరైన వారు తమ సేవలను కార్మిక సంఘాలనికి మరింతగా అందించాలని ఆకాంక్షించారు. లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి వామపక్ష భావజాలం అలవర్చుకున్న తనకు యాజమాన్యం ఒత్తిళ్లు పెద్ద ఇబ్బంది అనిపించలేదన్నారు. నిజాయితీగా ఉండటం వల్ల నేను ఎన్నో సమస్యలు ఎదుర్కొన్ననాని తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం లక్ష్మయ్య, రమణను బబూప్రసాద్, జన విజ్ఞాన వేదిక నాయకులు కె.ఆదినారాయణ సత్కరించారు. వివిధ సంఘాల నాయకులు కె.రమణ, చంద్రకళ, జె.శ్రీను, ఉష పాల్గొన్నారు.

జిజిహెచ్‌ని నిర్లక్ష్యం చేయడం తగదు

సరైన మార్గంలో నడపాలంటే బాధపడుతున్నారు


సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ ఆవేదన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి అత్యవసర విభాగంకు వచ్చే రోగులను సంబంధిత వార్డుకు వెళ్లే విధంగా రోస్టర్ ప్రకారం సి యంఒలు బాధ్యత తీసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. బుధవారం అత్యవసర విభాగాన్ని అయన పరిశీలించారు. ఈ విభాగంలో వైద్యాధికారులు, ఎమర్జన్సి మెడిసిన్ విభాగం ఇంచార్జి హెచ్ ఒ డి డాక్టర్ రాధిక తో డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడారు. ఈ ఆసుపత్రి ని కాకులకు, గద్దలకు వదిలేశారు. ఇప్పటి వరకు అత్యవసర విభాగంను పట్టించు కున్న పాపాన పోలేదు. సక్రమ మార్గంలో తీసుకుని వెళ్లాలని ప్రయత్నిస్తుంటే చాలా మంది ఫీల్ అవుతున్నారు. అత్యవసర కేసుల విషయం లో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వార్డుల్లో పడకలు ఖాళీగా ఉన్నాయని తెలిస్తే రోగులను క్యాజువాల్టి నుంచి పంపించే విధంగా చర్యలు తీసుకో వాలని, స్ట్రెచర్ పై రోగులు కనిపించకూడదన్నారు. అనంతరం ఆపరేషన్ థియేటర్ ను ఆయన తనిఖీ చేసి, అవసరమైన మార్పులను చేయాలని, పరికరాలను అందుబాటులో ఇంజనీర్ అధికారులకు ఆదేశించారు. గుండె ఆపరేషన్ వార్డు ను కూడా పరిశీలించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ యం ఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

నాణ్యమైన ఆహారం ఇవ్వండి

ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు శుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ఆసుపత్రి వంట గది నుంచి రోగులకు భోజనం అందించేందుకు కారిడార్ వైపు వెళుతున్న భోజన ట్రాలీని ఆయన తనిఖీ చేశారు. రోగులకు ఏమి అందిస్తున్నారు.. ఏ ఏ కూరలు ఇస్తున్నారని ఆయన పరిశీలించారు. గోరు చిక్కుడు కూరను రుచి చూసారు. సాంబారు నాణ్యత ను పెంచాలని అన్నారు. ముందుగా డైటిషియన్ సిబ్బందికి డ్రెస్ కోడ్ లేకపోవడం పై ఆయన మండి పడ్డారు. రోగులకు భోజనం అందించే విషయం లో సిబ్బంది గ్లౌజ్ లు వేసుకోవాలని ఆయన ఆదేశించారు.



జిజిహెచ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ కిరణ్ కుమార్

డ్రెస్ కోడ్ పాటించండి

నర్సింగ్ కళాశాల, హాస్టల్ ను సూపరింరెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. నర్సింగ్ కళాశాల, హాస్టల్ టీచింగ్ సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించక పోవడం పై ఆయన మండి పడ్డారు. ప్రతి ఒక్కరు డ్రెస్ కోడ్ అమలు చేయాలనీ ఆయన చెప్పారు. రోడ్లపై నర్సింగ్ విద్యార్థులు తిరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారిలో వారు గ్రూపులు పడి గొడవలు పడుతున్నారని ఇది ఎంత మాత్రం మంచిది కాదని ఆయన అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన సూచించారు. విద్యార్థులు పరిధి దాటి వెళుతున్న పట్టించుకోక పోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. హిందూ, చలపతి ఫార్మసి కళాశాల సిబ్బందికి ఎక్కువగా గదులు కేటాయించడం పై ఆరా తీశారు. వీటి పై వెంటనే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం బాత్ రూమ్ లను పరిశీలించి, అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది లో పరిశుభ్రత లోపించింది. అక్కడ వంట మనిషి లేకపోవడన్ని ఆయన గుర్తించారు. వీటి పరిష్కారం త్వరలోనే పూర్తి చేయాలనీ ఆయన ఆదేశించారు. అక్కడ ఉన్న ఆర్ ఒ ప్లాంట్ ను కూడా పరిశీలించారు. ప్లాంట్ వద్ద శుభ్రమైన వాతావరణం అందించాలని ఆయన కోరారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పథకాల పురోగతిపై మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం రాత్రి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్, జగనన్న సురక్ష, గ్రామ/వార్డు సచివాలయాలు, గడప గడపకు మన ప్రభుత్వం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 898 పనులు మంజూరు చేయగా, 287 మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలిన పనులు కూడా వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అవసరమైనన్ని నిధులు అందుబాటులో వున్నందున మిగిలిన పనులను గ్రౌండింగ్ చేసి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రూపొందించిన షెడ్యూల్ ప్రకారం జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా జరుగుతుందన్నారు. ఇంటింటికీ వెళుతున్న వాలంటీర్లు డ్రాప్ ఔట్స్‌కు సంబంధించిన వివరాలు సేకరించి, వారిని బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న హౌసింగ్ పనులకు సంబంధించి రోజువారీ వారికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. మూడవ ఆప్షన్ కింద నిర్మిస్తున్న గహాలకు సంబంధించి కాంట్రాక్టర్లు సరిగా స్పందించకుంటే వారిని తప్పించి వేరే వారితో పనులు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి స్టేజ్ కన్వర్షన్ వివరాలు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పూర్తిగా నిర్మించిన గృహాలకు కుళాయిల ఏర్పాటు, విద్యుచ్ఛక్తి సరఫరా వంటి పనులను వెంటనే చేపట్టాల న్నారు. ఒకటి, రెండవ ఆప్షన్ల కింద గహాలు నిర్మించు కుంటున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేలు అడ్వాన్స్ గడువు రేపటితో ముగుస్తున్నందున ఇప్పటి వరకు అడ్వాన్స్ పేమెంట్ తీసుకోని వారికి వివరించి వారు



మాట్లాడుతున్న కలెక్టర్

అడ్వాన్సులు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 19,874 మందికి అందించే అడ్వాన్స్ లక్ష్యం గాకా, ఇప్పటి వరకు 9,801 మందికి మాత్రమే అడ్వాన్స్ పేమెంట్స్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. జగనన్న కాలనీలలో నిర్మించాల్సిన ఆర్చీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సిఈఓ జె. మోహన్ రావు, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్, డిపిఓ కేశవరెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

కొండవీటి వాగుపై ఉండవల్లిలో నిర్మించిన లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌ను (ఎత్తిపోతల పథకం)ను ప్రభుత్వమే నిర్వహించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం తాడేపల్లి, ఉండవల్లి, కొలనుకొండ గ్రామాల రైతుల పొలాలకు సంబంధించి ఈ స్కీమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొన్నటి వరకు ప్రభుత్వమే ఈ స్కీము బాధ్యతలు నిర్వహించింది. గత కొంతకాలంగా రైతులే ఈ స్కీమ్‌ను నిర్వహించుకోవాలని, ఓ కమిటీగా ఏర్పడాలని సూచించింది. రైతుల డబ్బుతో రైతులే ఈ స్కీమ్‌న నిర్వహించుకునే విధంగా బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకుంది. ఎకరానికి రూ.500 నుంచి 1500 వరకు రైతులు తమ సొంత డబ్బులు వేసుకుని నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. గతంలో 1200 ఎకరాల వరకు



ఈ స్కీమ్ కింద సాగుబడి ఉండేది. ఇప్పుడది 300 ఎకరాలకు తగ్గిపోయింది. దీనిలో 35 హెచ్‌పి ఇంజన్లు మూడు పని చేస్తూ ఉండేవి. రిపేరు వచ్చి మూడు నెలల నుంచి మోటార్లు మూలనపడ్డాయి. అవి బాగు చేయడానికి, మెయిన్ కాలువ బాగు చేయడానికి లక్షల రూపాయలు అవుతాయని రైతులు చెబుతున్నారు. ఈ స్కీమ్ నిర్వహణలో భాగంగా మోటార్లు ఆడించే డ్రైవర్లతో పాటు ఇతర నిర్వహణ కోసం మరో రూ.లక్ష అవుతాయని అంచనా వేస్తున్నారు. ప్రభు త్వమే తిరిగి ఉండవల్లి ఎత్తిపోతల పథకాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధ్వర్య ంలోనే నిర్వహించాలని, రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని రైతు సంఘ అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి, వీరాస్వామి, ఎం.శ్రీనివాసరెడ్డి, కాశిరెడ్డి, బోసురెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న నేతాజీ

అంగన్వాడీ కార్యకర్తల గోడు వినండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ సమస్యలను పరిష్కారానికి వెనకడుగు వేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. గెడ్డం నిర్మల జ్యోతి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో నేతాజీ మాట్లాడారు. గత 9 యేళ్లగా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలకు జీతభత్యాలను పెంచకపోవడం శోచనీయమన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన నిధులు కోత పెట్టడం సమంజసం కాదని అన్నారు. తెలంగాణా రాష్ట్ర కంటే రూ. 2100 నిధులను తక్కువ కల్పించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నిర్మల జ్యోతి, సువర్ణలత, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

విఆర్‌ఎలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని విఆర్‌ఎల సంఘం తాడేపల్లి గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు కోరారు. అనుక సంవత్సరాలుగా విఆర్‌ఎలు ఐక్యంగా నిలబడి, పోరాడి అనేక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. బుధవారం కృష్ణనగర్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన విఆర్‌ఎలు అందరికీ పేస్కేల్ ఇవ్వాలని, విఆర్‌ఒ, అటెండర్ పోస్టుల్లో నియమించాలని, ప్రమోషన్లు కల్పించాలని, డిఎతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు జరిగే ఆందోళనలో మండలంలోని విఆర్‌ఎలు అందరూ పాల్గొనాలని కోరారు. విఆర్‌ఎల మధ్య కొంత మంది చీలికలు తేవడానికి ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారి మాటలు నమ్మొద్దని కోరారు. పోరాడకుండా ఏ సమస్యా పరిష్కరించబడలేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దశల వారీ ఆందోళనల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, హనుమంతరావు, రామారావు పాల్గొన్నారు.



సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆప్కాస్ మున్సిపల్ సిబ్బందిని అందరినీ పర్మినెంట్ చేయాలని, అలాగే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నులకపేట సెంటర్, కృష్ణుని గుడి మస్టర్ పాయింట్ల వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేవాల్లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల డిమాండ్ల సాధన కోసం ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్మికులకు గత నాలుగు నెలల నుంచి హెల్త్ అలవెన్సులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే వెంటనే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు అందరినీ పర్మినెంట్ చేస్తామని సిఎం ఇచ్చిన హామీని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా పర్మినెంట్ ఊసే ఎత్తడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై దశలవారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 20, 21 తేదీల్లో మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోషం, కె.వెంగమ్మ, కె.అనూష, రాంబాబు, మరియమ్మ, ఇ.కొండమ్మ, సీమోన్, విజయ్, రాము, విమల, ఎల్.సతీష్, శ్రీను, ఈశ్వరమ్మ, పి.మేరి, నాని, కె.కామాక్షి పాల్గొన్నారు.

అర్జీలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

'జగనన్నకు చెబుదాం' కు వచ్చే ఆర్జీలను సకాలంలో, సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధి కారులతో కలసి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జిదారులను సంతోషంగా స్వాగతించి, సానుకూలంగా చిరునవ్వుతో సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్.ఎల్.ఎ లోకి వెళ్ళకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా సమస్యలు రెడ్రెస్సల్ చేసే సమయంలో అర్జిదారులతో, అవసరమైతే ప్రత్యర్థులతో కూడా రెండుమూడు సార్లు చర్చించి సమస్యను పరి ష్కరించాలన్నారు. అర్జిదారులు పూర్తి స్థాయిలో సంతృప్తి పడాలని, రికార్డులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, రీ-ఓపెన్ కేసుల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకోవా లన్నారు. అసంతృప్తి కేసుల విషయంలో వ్యక్తిగతంగా పరి శీలించి అర్జిదారుడితో చర్చించి సమస్య పరిష్కరించడంతో పాటు సంతృప్తి చెందేలా పనులు చేయాలని, వీలైనంత వరకు రీ-ఓపెన్ వరకు వెళ్ళ కుండా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. పదే పదే పునరావృత మౌతున్న కేసులను పైఅధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వాటిని బ్లాకు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి నెల 2 వ, 4 వ మంగళవారాల్లో మండల స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మండల టీమ్‌లకు అవగాహన కల్పించాలన్నారు. అసంతృప్తి స్థాయిని తగ్గించి వచ్చిన అర్జీల ఎండార్స్‌మెంట్ విషయంలో అర్జిదారుడికి అర్థమయ్యేలా ఎండార్స్ మెంట్ చేయాలని, సరైన కాలంలో నాణ్యతతో కూడిన పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో జేసి, రెవెన్యూ అధికారి

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్

ప్రజాశక్తి - యడ్లపాడు



యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్ఐగా పి.సురేష్ బాధ్యతలు చేపట్టారు. 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పైడి రాంబాబు ఇక్కడ విధులు నిర్వహించారు. 2009వ బ్యాచ్‌కు చెందిన సురేష్, తాడికొండ నియోజకవర్గం లోని ఫిరంగిపురం, నకిరేకల్ మండలాల్లోని స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వ హించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నకిరేకల్ నుంచి యడ్లపాడుకు బదిలీ కాగా, ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ పైడి రాంబాబు ఎస్‌బికు బదిలీ అయ్యారు.

చర్మకార సేవా సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులుగా రవికుమార్, యోహాన్

ప్రజాశక్తి - వినుకొండ



ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులుగా మల్ల వరపు రవి కుమార్‌ను, వినుకొండ నియోజకవర్గం అధ్యక్షులుగా జుంజు యోహాను నియమించారు. ఆంధ్ర ప్రదేశ్ చర్మకార సేవా సంఘం, మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అధ్యక్షులు బుల్ల రాజారావు చేతుల మీదగా ఈ నియామకపత్రాలను అందుకున్నారు. శావల్యాపురం మండలం అధ్యక్షులుగా కాకాని వెంకటేశ్వర్లు, ఈపూరు మండల అధ్యక్షులుగా బందెల కన్నయ్యను, బొల్లాపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా పెద్దిటి ఇస్సాకును, వినుకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మేడిపల్లి సుబ్బారావును నియమించారు. ఈ నియమకాలు వెంటనే అమల్లోకి వస్తుందని చర్మకార సేవా సంఘం తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా చర్మకారుల సేవా సంఘం సభ్యులను సన్మానించారు.




మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం చింతలతండాకి చెందిన కేతావత్ దేవ్ సింగ్ నాయక్ మూడు రోజుల క్రితం అనారోగ్య కారణంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుని భార్యకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఎంపిడిఒ కోటేశ్వరరావు అందించారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీను నాయక్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

దొంగోట్లు చేర్చేందుకు కుట్ర : టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



దొంగ ఓట్లు చేర్చేందుకు వైసిపి కుట్రలు చేస్తోందని టిడిపి శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి నియో జకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని పివిఎస్ కళ్యాణ మంట పంలో నియోజకవర్గ బూతు స్థాయి కార్యకర్తలతో బుధ వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిజమైన ఓట్లు తొల గించేందుకు వైసిపి కుట్ర చేస్తోందని, నిజమైన ఓట్లను కాపాడుకోవాలని సూచించారు. దొంగ ఓట్లను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాను బూతు స్థాయి కార్యకర్తలు పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించాలని కోరారు.

21 నుంచి ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-రెంటచింతల

ఓటు వజ్రాయుధం వంటిదని, పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎలక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. బుధవారం బిఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకరికి రెండు, మూడు ఓట్లు ఉండడానికి వీల్లేదని, ఈ విషయంలో అధికారులు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే ఉందని ఓటర్లంతా ఓటు కార్డు కు ఆధార్‌తో అనుసంధానించారో లేదో పరిశీలించారు. ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకూడదని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ కె.పుల్లారావు ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు బాషా, డిప్యూటీ ఎమ్మార్వో రాజారావు, ఆర్ఐ కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎలక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ చంద్రమూర్తి

8 అడుగుల కొండచిలువ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలంలోని విజయపురిలో మంగళవారం రాత్రి పోస్ట్ ఆఫీస్ లైన్ లో హోమ్ గార్డ్ శ్రీను ఇంటిలో 8 అడుగుల కొండచిలువ ప్రవేశించింది. ఈ సమాచారాన్ని నేచర్ బయో డైవర్సిటీ కన్జర్వేషన్ సొసైటీ వారికి ఫోన్ చేసి చెప్పారు. సొసైటీ ప్రెసిడెంట్ బి.మహేష్ సెక్రటరీ ఊరే మధు హుటాహుటిన వెళ్లి కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం సెక్రటరీ యు.మధు మాట్లా డుతూ దీనిని ఇండియన్ రాక్ పైథాన్ అంటారని, దీనిని ఎవరైనా చంపితే వైల్డ్ లైఫ్ యాక్టు కింద కేసు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష పడుతుందని చెప్పారు. వర్షాకాలం రావడం వల్ల పాములు ఇళ్ళలోకి ప్రవేశిస్తాయని మానవ పరిసరాల్లో పాములు ప్రవేశిస్తే తమ ఫోన్ నెంబర్లు 9491472568, 7382128558 కు ఫోన్ చేయాలని సూచించారు.



తమ్మవరం, మాదిపాడులో సిసిరోడ్లు ప్రారంభం



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని తమ్మవరంలో రూ.10 లక్షల జిజిఎంపి నిధులతో రెండు సిసి రోడ్లు, డ్రెయిన్లను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం పూర్తైన గ్రామాలకు, సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని, వాటితో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు 95 శాతానికి పైగా కార్యక్రమం పూర్తైందని, ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో సమస్యలు తీరుస్తున్నామని, అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, నీటి సౌకర్యాలు వంటివి ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ సాంబిరెడ్డి, పెదకూరపాడు ఎంపిపి బెల్లంకొండ వీరయ్య, తమ్మవరం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలోని మాదిపాడులో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శంకరరావు బుధవారం ప్రారంభించారు. మాదిపాడులో రూ.5.50 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సైడు కాల్వలను ఆయన ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన పీర్ల చావిడి పునర్నిర్మాణానికి సహకరించాలని అన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

సత్తెమ్మ తల్లి ఆలయ అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని రక్షించే బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే శంకరరావు అన్నారు. బుధవారం అచ్చంపేట-మాదిపాడు మెయిన్ రోడ్డు నుంచి సత్తెమ్మతల్లి ఆలయం వరకు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖాధికారి కె.రామచంద్రయ్యతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

పల్నాడులో వైసిపి కోడ్ అమలుచేస్తున్న పోలీసులు

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పోలీసులు పల్నాడు జిల్లాలో వైసిపి కోడ్ అమలు చేస్తు న్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసరావు పేటలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆదివారం నరసరావుపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కడియాల రమేష్ లపై వైసిపి వర్గీయులు దాడికి ప్రయత్నించి కారు అద్దాలు ధ్వంసం చేసిన ఘటన గురించి ప్రస్తావించారు. వైసిసికి పని చేయాలని ఉంటే ఎస్పీ తన ఉద్యోగానికి రాజీనామా చేసి, వైసిపి కండువా కప్పు కోవాలని, ఐపిఎస్ ముసుగులో ఒక పార్టీ కోసం పనిచేయడం తగదని ఆరోపించారు. ఐపీ పెట్టిన వ్యక్తుల ఆస్తులు ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ఆధీనంలో ఉన్నాయని, బాధితులకు పంచకుండా ఆక్రమించారని, బాధితులకు రక్షణ కరువైందని ఆరోపించారు. అమరావతి హోమ్స్ వద్ద జరిగిన ఘటనలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి స్వయంగా దగ్గరుండి వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టారని, దాడికి సంబంధించి పూర్తి వీడియోలు ఉన్నా వైసిపి నాయ కులు, కార్యకర్తలపై పోలీసులు ఎందుకు కేసులు నమోదు చేయలేదో ఎస్పీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారి పేర్లు సెక్షన్ 307 లో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. బాధితులకు రక్తాలు కారుతున్న రక్షణ కల్పించలేదని, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే చేర్చుకోలేదని అన్నారు. న్యాయపోరాటం కోసం ప్రైవేటు కేసులు వేస్తామని హెచ్చరించారు. టిడిపి నేత గ్రం థాలయ మాజీ చైర్మన్ దాసరి రాజా మాస్టర్ మాట్లాడుతూ టిడిపి నేతలపై జరిగిన దాడులను సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాలని కోరారు. దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న పలువురిని జీవి ఆంజనేయులుతో పాటు నాయకులు పరామర్శించారు. టిడిపి నాయకులు వి.వెంకట నరసయ్య, కె.బ్రహ్మయ్య, కె.కిరణ్ కుమార్, తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.కోటిరెడ్డి పాల్గొన్నారు.



'మహిళలకు భద్రత కరువు'

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి పాలనలో రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని, అత్యాచారాలు, దాడులు పెరిగి పోయాయని తెలుగు మహిళ నాయకులు విమర్శించారు. వినుకొండ నియోజకవర్గం తెలుగు మహిళా ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు ఎం.ఆదిలక్ష్మి, నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు ఎం.చౌడమ్మ, జిల్లా కార్యదర్శి వాంకుడావత్తు మంగాబాయి మాట్లాడారు. కార్యక్రమంల కౌన్సిలర్ పి.అంజలి, టిడిపి మహిళలు సిహెచ్ సుబ్బులు, ఈశ్వరమ్మ, రాఘవ, శివ పార్వతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఆయుఖాన్ పాల్గొన్నారు.

డైట్ బిల్లులు మంజూరు చేయండి

ప్రజాశక్తి-రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే వివిధ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి డైట్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలుగు యువత అధికార ప్రతినిధి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు బుధవారం ఆయన మాట్లాడుతూ రెంటచింతలలోనే బీసీ బాలుర, బాలికలు, ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్ లు ఉన్నాయన్నారు ఇంకా గిరిజన సంక్షేమ గురుకులం కూడా ఉందన్నారు. మార్చి నుంచి భోజన బిల్లులు విడుదల చేయకపోవడం వలన హాస్టల్లో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థుల ఆకలిని తీరుస్తున్నారు ఏప్రిల్ నెల నుంచి మెస్ బిల్లులు పెంచడం వలన ఆ డబ్బులతో ఇంకా భారంగా మారిందన్నారు ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.



పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

చదువు మానేసిన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్

ప్రజాశక్తి-దుగ్గిరాల

పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఉపా ధ్యాయులను, వాలంటీర్లను ఆదేశించారు. మండలంలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో బుధవారం జరి గిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటీవల పదో తరగతి తప్పిన 11 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించి వారికి పుస్తకాలు స్కూల్ బ్యాగ్స్ అందించారు. చదువు మానే సిన పిల్లల తల్లిదండ్రులతో పిల్లలను పాఠశాలలలో చేర్పిం చాల్సిం దిగా చరవాణి ద్వారా స్వయంగా మాట్లాడారు. పిల్ల లకు హాస్టల్ వసతి కల్పించి అమ్మ ఒడి పథకం అందిస్తామని భరోసా నిచ్చారు. ఎడ్యుకేషనల్ సర్వేలో తమ పరిధిలో ఉన్న పిల్లలందరిని పాఠశాలలో చేర్పించిన ఇద్దరు వాలంటీర్లను శా లువతో సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె. మల్లే శ్వరి, మండల విద్యాధికారి కె.శ్రీనివాసరావు, సర్పంచ్ పి. మేర మ్మ, ఎంపిపిదానబోయిన సంతోష రూపవాణి పాల్గొన్నారు.

శ్రీరమణ మృతికి 'అవగాహన' సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ కథకుడు, హాస్య వ్యంగ్య రచయిత సాహిత్య, కళారంగాల్లో ప్రసిద్ధుడు శ్రీరమణ మృతికి అవగాహన సంస్థ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శ్రీరమణ అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీ చానల్ చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలి రేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించి, అందరి అభిమానం పొందారని అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. ఎన్నో సాంప్రదాయ కుటుంబాల కథ మిథునంతో శ్రీరమణకు మంచి పేరు వచ్చిందన్నారు. బాపు, రమణ వంటి దిగ్గజాలతో కలిసి పనిచేశారన్నారు. పేరడీ రచనలకు శ్రీరమణ ఎంతగానో ప్రసిద్ధి చెందారన్నారు. హాస్యభరిత కాలమ్స్ నడిపిన కాలమిస్టుగా, కథకుడిగా, సాహిత్య కళారంగాలకు ఆయన విశిష్ట సేవలు అందించారని, ఆయన రచనల ద్వారా సాహితీరంగంలో చిరంజీవిగా నిలిచిపోతారని అన్నారు.



బాల్యమిత్రుడి పేరిట ఉచితంగా షార్టుహ్యాండ్

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరిలోని యనమదల వారి వీధిలోని జీవీఆర్ ఆచార్యులు అండ్ రఘునాథా చార్య వేదిక్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం జీటీవీ రమణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ షార్టుహ్యాండ్ ను ప్రారంభోత్సవం చేశారు. జీఎస్సార్ వరదాచార్యులు (నాని), జి. సింహాద్రి తిరువెంగళ్ నాథ్ ల బాల్యమిత్రుడు జి.టి.వి. రమణ జయంతిని పురస్కరించు కుని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆయన తనయుడు హనుమంతరావు చేశారు. జీవీఆర్ ఆచార్యులు అండ్ రఘునాథా చార్య వేదిక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా అభ్య ర్థులకు ఉచితంగా షార్టుహ్యాండ్ బోధిస్తున్నారు. ఇక్కడ శిష్యరికం చేసిన 20 మంది వరకు వివిధ ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. ప్రస్తుతం ఈ ఇనిస్టిట్యూట్ లో 40 మంది వరకు ఉచితంగా షార్టు హ్యాండ్ శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో జీవీఆర్ ఆచార్యులు, షార్టుహ్యాండ్ ఇని స్టిట్యూట్ నిర్వాహకులు జీఎస్ టీ నాథ్, ఇంగ్లీషు టీచర్ సువ ర్చల, ట్రస్ట్ సభ్యులు నాని, మల్లి, శివ, మనోహర్, భరద్వాజ్, విక్రమ్, కిరణ్, శేషు, ఇనిస్టిట్యూట్ లో విద్యను అభ్యసించి ఉద్యోగాలు పొందిన వారు పాల్గొన్నారు.

బలవంతంగా చెత్త పన్ను వసూళ్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

చెత్త పన్ను వసూళ్ల విషయంలో తగ్గేది లేదన్నట్లు ప్రభుత్వ అధికారులు ముందుకు వెళ్తున్నారు. తాడేపల్లి పట్టణంలోని మహానాడు సచివాలయాల పరిధిలో గత వారం రోజుల నుంచి చెత్త పన్ను బలవంతంగా వసూలు చేస్తున్నారు. వార్డు వాలంటీర్లు, శానిటేషన్ సెక్రటరీలు ఇంటింటికీ తిరిగి ప్రజల వద్ద నుంచి చెత్త పన్ను బకాయిలు వసూలు చేస్తున్నారు. పన్ను చెల్లించకపోతే సంక్షేమ పథకాలు రావని బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే అమ్మఒడి డబ్బులు ఎక్కువ మంది లబ్దిదారులకు బ్యాంకులో జమ కాకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. కాపు నేస్తం పథకం కింద త్వరలో డబ్బులు జమ కానున్నాయని చెబుతున్నారు. చెత్త పన్ను చెల్లించకపోతే ఈ పథకానికి సబంధించిన డబ్బులు ఖాతాల్లో జమ కావని హెచ్చరిస్తున్నారు. చెత్త పన్ను కట్టిన వారికి కనీసం రసీదులు కూడా ఇవ్వడంలేదు. ఈ డబ్బులు కార్పొరేషన్‌కు జమవుతున్నాయా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మహానాడులో కొన్ని బహుళ అం తస్తుల యజమానుల నుంచి మామూళ్లు గుంజుకుని ఇంటి పన్నులు వేయకుండా కిందిస్థాయి ఉద్యోగులు తమ జేబుల్లో వేసుకుంటున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే లక్షలాది రూపాయలు అక్రమ ఆస్తులు పంచుకున్నట్లు తెలుస్తుంది. కార్పొరేషన్‌కు నష్టం చేస్తున్న ఇటువంటి కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసు కోవాలని స్థానికులు డిమాండ్ చేస్తునఆనరు. ఒకపక్క కార్పొరేషన్‌కు రావాల్సిన లక్షలాది రూపాయలు పక్కదారి పడుతుంటే చేష్టలుడిగి చూస్తున్న అధికారులు, మరోపక్క చెత్త పన్ను వసూళ్ల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని స్థానికులు అంటున్నారు. దీనిపై విచారణ జరిపి తగు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.



తూటాకు, పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండల పరిధిలోని కొండముది , నిడు బ్రోలు, వడ్డిముక్కల, మాచవరం గ్రామాల (పంట. భూములకు నీరందిస్తున్న పంట కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న తూటాకు. గుర్రపు డెక్క, పిచ్చి చెట్లను జెసిబి సాయంతో బుధవారం తొలగించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆదేశాల మేకు జిల్లా వ్యవసాయ సలహా మండలి. డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో. వెలగా లింగారావు, విజయ రాజేశ్వరి యాకోబు పాల్గొన్నారు.

చెస్ రాపిడ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

స్థానిక వివేకా ఫాస్టర్ స్కూల్ ఒలింపి యాడ్ క్యాం పస్‌లో గుంటూరు జిల్లా చెస్ రాపిడ్, బ్లీడజ్ ఛాంపి యన్ షిప్ పోటీలు బుధవారం ప్రారంభ మయ్యాయి. ఈ పోటీల్లో గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి నుండి 90 మంది కి పైగా క్రీడా కారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొన్నూరు మున్సిపల్ కమిషనర్ సిఎంఎస్ నయూం అహ్మద్, తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వివేక స్కూల్స్ డైరె క్టర్ ఉప్పాల సుకుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక , శారీరక వికాసానికి తోడ్పడతాయని, అందువలన ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడను ఎంచుకొని సాధన చేయాలని సూచిం చారు. చెస్ పోటీల్లో రాపిడ్ విభాగంలో గుంటూరు కి



చెందిన హరి సూర్య భరద్వాజ్ గుండెప్పుడి ఐదు రౌండ్లకు గాను ఐదు రౌండ్లు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. ,గుంటూరుకి చెందిన కొణతం స్నేహిల్ ఐదు రౌండ్లకు గాను ఐదు పాయింట్లు సాధించినప్పటికీ టైబ్ బ్రేక్ స్కోరు ఆధా రంగా రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీందర్ రాజు, పొన్నూరు చెస్ అకాడమీ ప్రెసిడెంట్ గంగరాజు మురళీకృష్ణ, సెక్రటరీ బాజీ బాషా, వైస్ ప్రెసిడెంట్ పిఎల్ శ్రీనివాస్, టోర్నమెంట్ కన్వీనర్ బాజీ బాషా పాల్గొన్నారు.

నాడీ వ్యవస్థను మెరుగుపరిచే ఫోర్టిఫైడ్ రైస్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నిరుపేద ప్రజల్లో రక్తహీనతకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బలవర్ధక బియ్యాన్ని (ఫోర్టిఫైడ్ రైస్) ప్రతిఒక్కరూ వాడుకోవాలని సెక్టార్ సూపర్ వైజర్ కె వెంకటలక్ష్మి అన్నారు. పెదరావూరులో గర్భిణులు, బాలిం తలు, కిశోర బాలికలతో బుధవారం సమావేశమయ్యారు. రక్తహీనతకు చెక్ పెట్టడంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ-12 కీలకమైన పోషకాలతో తయారు చేసిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణీలకు, చిన్నా రులకు ఐరన్, బి12 విటమిన్లు అందుతాయన్నారు. దీని ద్వారా గర్భస్థ శిశువుల నాడీ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని తెలి పారు. కార్యక్రమంలో కె.కళాజ్యోతి, ఎ.ప్రేమ కుమారి, కె బుజ్జి, ఆషా, సుజాత పాల్గొన్నారు.





గర్భిణులు, బాలింతలకు సూచినలిస్తున్న సెక్టార్ సూపర్ వైజర్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఫోర్టిఫైడ్ రైస్ పై మండలంలోని మంగళగిరి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కాజాలో అవగాహన కల్పించారు. ఎనిమియాను అధిగమించడం కోసం గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఈ రైస్ లో ఐరన్, పోలిక్ యాసిడ్, బి12 ఉంటాయని చెప్పారు. ప్రాజెక్ట్ అధికారి ఎ.సులోచన, కె.సరిత, జి. వేణు కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గుండెపోటుతో పల్లె రవి మృతి

ప్రజాశక్తి - తాడికొండ



తాడికొండ మండల పరిషత్ కార్యాలయం వెలుగు ప్రాజెక్టులో పని చేస్తున్న సిసి పల్లె రవి (45) బుధ వారం వేకువజామున గుండెపోటుతో మరణించారు.బుధవారం వేకువ జామున గుండె నొప్పిగా ఉందని కుటుం బీకులకు చెప్పడంతో వైద్యుని దగ్గరకు తీసుకువెళ్లారు . నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలి మరణించారు.2006లో వెలు గులో సీసీ ఉద్యోగిగా చేరిన ఆయన, వట్టి చెరుకూరు, బెల్లంకొండ, మంగళగిరి, తాడేపల్లిలో పని చేశారు. గత సంవత్సరం తాడికొండకు బదిలీపై వచ్చారు. రవికి భార్య , ఇద్దరు కుమారులు ఉన్నారు. రవి కుటుంబాన్ని వైసిపి తాడికొండ నియో జకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పరామర్శించి, సంతాపం తెలిపారు. గుంటూరు పార్లమెంటు పరిధిలో ఉన్న అన్ని మండలాలకు చెందిన వెలుగు ఉద్యోగులు రవికి కన్నీటి వీడ్కోలు పలికారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని కొత్తపేటకు చెందిన సిహెచ్ వెంకటేశ్వరరావు, విశ్రాంతమ్మ, బేతపూడి గ్రామానికి చెందిన జె వెంకటరత్నం అనారోగ్య బాధ్యతలు గా ఉన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి సహకారంతో బుధవారం ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో చేనేత భాగం జిల్లా అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, వైసిపి నాయకులు ఎండి ఫిరోజ్, ఏ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ చాంద్ మృతిపై సంతాపం

ప్రజాశక్తి-మంగళగిరి

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత ఉమెన్ చాండ్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ సలీం ఆధ్వర్యంలో బుధవారం సంతాప సభ జరిగింది. ఉమెన్ చాందీ చిత్ర పటానికి ఇన్‌ఛార్జి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్.హనుమంత రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రత్న గోపాల్, మంగళగిరి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి.సాంబశివరావు, సీనియర్ నాయకులు ఎం.కృష్ణయ్య, మండల కాంగ్రెస్ కార్యదర్శి బి. కృష్ణారావు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాజకీయ నాయకుల పరస్పర వ్యక్తిగత ఆరోపణలు తారాస్థాయికి చేరాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో అనేక క్షీణతలు కనిపిస్తున్నట్లే వ్యక్తీకరణల్లో కూడా పత నావస్థ దశ వచ్చిందన్నారు. ప్రత్యర్థుల్ని విమర్శించేటప్పుడు ఏ నియమాలు పాటించాల్సిన అవసరం లేదన్నట్లుగా వ్యవ హరిస్తున్న నాయకుల తీరు సభ్య సమాజం సిగ్గుతో తల దించుకునే విధంగా ఉందన్నారు. రాజకీయ అంశాలపై అస త్యాలు, అర్ధసత్యాలు గుప్పించటం, బ్రహ్మాస్త్రాలు వేస్తు న్నామనుకొని నోరు జారటాలు, ఆపై నాలుక కరుచు కోవటాలు పద్ధతులు పాటించేవాళ్లకు ఇబ్బందిగా ఉంటుం దన్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో నాయకుల మధ్య ఆరో పణలు, ప్రత్యారోపణలు జుగుప్సాకరంగా ఉన్నాయని,

మొహరం వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలో మోహర్రం పండుగ వేడుకలు బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. పీర్లను పట్టణం లోని మొల్లా దహెరా మస్జిద్ వద్ద గల పీర్ల చావిడిలో పీర్లను అలంకరించారు. ఈ వేడుకలు ఈ నెల 27 వ తేదీ వరకు జరగనున్నాయని మత పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మొల్లా పెద్దలు పాల్గొన్నారు.

ఎన్క్యాస్ సర్టిఫికెట్ పొందిన తొలి యుపిహెచ్‌సి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మంగళగిరి గణపతి నగర్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ రాష్ట్రంలోనే తొలిసారిగా ఎన్క్యాస్ (నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్‌స్టాండర్డ్స్) గుర్తింపును పొందింది. ఈ విషయాన్ని హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష తెలిపారు. భారత ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ విశాల్ చౌహాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఏడాది మే 19, 20 తేదీలలో ఢిల్లీ ఎన్క్యాస్ టీం హెల్త్ సెంటర్‌ను సందర్శించి హెల్త్ సెంటర్లోని 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాలను పరిశీలించింది. 12 రకాల వైద్య ఆరోగ్య సౌకర్యాలలో 100 మార్కులకు గాను 96.2 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఫుల్ సర్టిఫైడ్ పొందినదని తెలియజేశారు. రాష్ట్రంలో తొలి అర్బన్ హెల్త్ సెంటర్‌గా ఎన్క్యాస్ సర్టిఫికెట్ పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఆళ్ళ రామకష్ణారెడ్డి(ఆర్కే) సహాయ సహకారాలతో, వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, డిఎంఅండ్ హెచ్‌ఒ డాక్టర్ శ్రావణ్ బాబు, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలతో సర్టిఫికెట్ సాధించగలిగామని డాక్టర్ అనూష తెలిపారు. హెల్త్ సెంటర్లో భవిష్యత్తులో కూడా నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా పాటిస్తూనే, రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో కెఎల్‌యు విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



రైఫిల్ షూటింగ్ పోటీలో కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో సిఎస్ ఐటి ద్వితీయ సంవత్సరం చదువుతున్న మద్దినేని ఉమామహేష్ కాంస్య పతకం సాధించాడని కెఎల్‌యు క్రీడా విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె హరికిషోర్ బుధవారం తెలిపారు. ఈ నెల14 నుండి 25 వరకు దక్షిణ కొరియాలోని చాంగ్ వోన్లో జరుగుతున్న జూనియర్ ప్రపంచ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమా మహేష్ పాల్గొన్నాడని తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో క్రీడలకు, క్రీడా కారులకు అత్యధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. ఉమా మహేష్‌ను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు అభినందించారు.

స్వచ్ఛ గుంటూరు సాధనకు సహకరించండి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేలా నగరపాలక సంస్థ సంస్థాగతంగా మెరుగైన పారిశుధ్య పనులు చేపడుతుందని, ప్రజలు కూడా తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా తెలియచేసి నగరానికి మెరుగైన ర్యాంక్ రావడంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరానికి జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగరపాలక సంస్థ తరుపున 206 వార్డు సచివాలయాల పరిధిలో ఇంటింటి నుండి చెత్త సేకరణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి వచ్చినందున మరింతగా నూరు శాతం సేకరణ చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా నగర సుందరీకరణలో భాగంగా మెయిన్ రోడ్ల డివైడర్లు, ఆర్.ఓ.బి.లు, ఆర్.యు.బి.ల వద్ద పెయింటింగ్ చేయించామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీల్లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంక్ వచ్చేందుకు నగర ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజలు నేరుగా **mygov platform, swacchata app, ss2023 vote for your city app, ss2023 vote for your city web** ల ద్వారా ఫోన్‌కి వచ్చే ఓటిపిని ఇంటి వద్దకు వచ్చే నగరపాలక సంస్థ వాలంటీర్లు, కార్యదర్శులకు తెలిపి అభిప్రాయాలను తెలియచేయాలని, ఇది ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల అభిప్రాయం కోసమే ఓటిపి అని ఎటువంటి అపోహలకు గురికావద్దని తెలిపారు. అలాగే ప్రజారోగ్య కార్మికులు, కార్యదర్శులు, ఇనస్పెక్టర్లు తమ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, యాప్ ల వినియోగం, ఓటిపి అంశాల పై అవగాహన కల్గించాలని ఆదేశించారు.

ప్లస్ 2 స్కూల్స్‌లో ఖాళీల భర్తీకి నేడు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు :ప్లస్-2 పాఠశాలల్లో పనిచేయటానికి వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులలో పనిచేయటానికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లు నేడు ఉదయం 10.30 గంటలకు గుంటూరు డిఇఒ కార్యాలయానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటలనలో తెలిపారు. కాకుమాను మండలం, చిన్నలింగాయపాలెం హైస్కూల్లో, పెదకూరపాడు మండలం, 75 తాళ్లూరు జెడ్పీ హైస్కూల్లో కెమిస్ట్రీ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. నిజాంపట్నం మండలం, అడవులదీవి జెడ్పీహైస్కూల్లో జువాలజీ పోస్టు ఒకటి, వేమూరు మండలం, పెరవలి జెడ్పీహైస్కూల్, 75 తాళ్లూరు జెడ్పీ హైస్కూల్లో కామర్స్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పన ఖాళీ ఉందని తెలిపారు. గుంటూరు మండలం, అంకిరెడ్డి పాలెం జెడ్పీ హైస్కూల్లో గణితం పోస్టు ఖాళీ ఉందన్నారు. కావున స్కూల్ అసిస్టెంట్లు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, సేవా పుస్తకాలు తీసుకొని హాజరు కావాలని, అనంతరం అర్హతను బట్టి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

రేపు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు :ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడవ శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 21న కలెక్టరేట్‌లోని, ఎస్.ఆర్.శంకరన్ హాల్లో ఉదయం 11 గంటలకు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు అందరూ వారి ఉద్యోగ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయవచ్చున్నారు. 2022 అక్టోబర్ నుండి నిర్వహించిన ఉద్యోగుల గ్రీవెన్స్‌లో అందిన 73 అర్జీలలో 64 అర్జీలు పరిష్కరించినట్లు డిఆర్‌ఒ తెలిపారు.

ప్రజల జీవన విధానంలో మార్పులు తేవాలి

మెప్మా, డిఆర్‌డిఎ అధికారుల సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా


సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి

పల్నాడు జిల్లా అభివృద్ధికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (డిఆర్‌డిఎ) సంస్థలు ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారుల పనితీరు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన లక్ష్యాలు, ప్రజల జీవన విధానం మెరుగు పరచడానికి తీసుకున్న చర్యలను సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రెండు శాఖల జిల్లా అధికారులు, ఆయా డివిజన్‌లలో పనిచేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పును, స్ఫూర్తిదాయక విధానాలను ప్రాజెక్ట్ డైరెక్టర్లు జిల్లా కలెక్టర్ కు పవర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు అర్హత కలిగిన పేదవారికి సంక్షేమ పథకాలను సకాలంలో అందజేస్తూ వారి జీవన విధానంలో మార్పులు తీసుకు వస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా అందజేస్తున్న లక్ష్యాలలో వెనకబడుతున్న అధికారులకు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పలు సూచనలు చేశారు. వైఎస్ఆర్ చేయూత పథకానికి, జగనన్న పాల వెల్లువ పథకంతో అనుసంధానం చేసి స్వయం సహాయక సంఘాల జీవన విధానంలో మార్పులు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో బ్యాంకు ఖాతాలకు, ఆధార్ కార్డుల అనుసంధానం, సకాలంలో రుణాలను అందించడం, జగనన్న పేదలందరికీ ఇల్లు, టిడ్కో గృహ నిర్మాణ పథకం, జగనన్న పేదలందరికీ ఇల్లు నిర్మాణ పథకంలో సొంత గృహాలను నిర్వహించుకునే మహిళలకు వారి ఆర్థిక స్తోమత మేరకు తప్పనిసరిగా రుణాలను అందించే ప్రక్రియ చేపట్టి, ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళల ఆర్థిక అభివద్ధికి తప్పని సరిగా వ్యాపారాలు పెట్టేలా తగిన ప్రోత్సాహం అందించడం తోపాటు, సకాలంలో బ్యాంకు రుణాలు అందించాలన్నారు. బాలికల్లో ప్రధానంగా రక్తహీనత సమస్య జిల్లాలో ఎక్కువగా ఉన్న దృష్ట్యా వారికి ప్రతిరోజు గుడ్డు, పాలు అందించేలా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. మగ పిల్లలకు సంబంధించి అట్లాస్, స్పోర్ట్స్, షూస్, వాచీ, అవసరమైన పుస్తకాలను కొని ఇవ్వాలన్నారు. జనవరిలో పర్యాటక ప్రాంతాల సందర్శనకు వారిలో నైపుణ్యాశక్తిని పెంపొందించే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో పట్టణ పేదల నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాలు నాయక్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, ఏపీఎంలు, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

కూరగాయలు, నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలి

ఆర్‌బికెల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలివ్వాలి

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి


జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్

కూరగాయలు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని వెంటనే పెరిగిన ధరలను తగ్గించాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పుతుంబాక భవన్‌లో జరిగిన సిపిఎం సత్తెనపల్లి పట్టణ జనరల్ బాడీ సమావేశం పులిపాటి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడుతు వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు ఆర్‌బికెల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని, జిల్లాలో కౌలు రైతు లందరికీ నిబంధనలను సవరించి గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం నూతన భవన నిర్మాణం పూర్తయ్యి సంవత్సరం అయినప్పటికీ రోడ్లు, ఇతర పెండింగ్ పనులను సాకుగా చూపి జడ్‌పి బాలికల హైస్కూల్‌లో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాన్ని తరలించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా నూతన భవనానికి సంబంధించిన రోడ్లు ఇతర పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి నూతన భవనం వినియోగంలోకి తీసుకువచ్చి విద్యా సంవత్సరం వృధా కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణాల్లో పెంచిన ఆస్తిపన్ను వెంటనే ఉపసంహరించుకోవాలని, ట్రూఆప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, సర్ చార్జీలు, అదనపు విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించు కోవాలన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, నాయకులు అనుముల వీరబ్రహ్మం, రొంపిచర్ల పురుషోత్తం, జడ రాజ్ కుమార్, గద్దె ఉమాశ్రీ, మునగా జ్యోతి, పంతంగి ప్రభాకర్, మామిడి జగన్నాథరావు పాల్గొన్నారు.


త్రిపాటిని సన్మానిస్తున్న శాంతమూర్తి

ఎయిమ్స్ డైరెక్టర్‌ను కలిసిన శాంతమూర్తి

ప్రజాశక్తి-గుంటూరు

మంగళగిరిలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) డైరెక్టర్ ముఖేశ్ త్రిపాఠిని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భగా త్రిపాటికి స్పేస్ ఎడ్యుకేషన్ కిట్ అందచేసి, శాలువాతో సన్మానించారు. మెడికల్ సైన్స్‌లో ఇస్రో పాత్ర అనే అంశంపై తమ స్పేస్ క్లబ్ ద్వారా ఎయిమ్స్ విద్యార్థులకు అవగాహన కల్పించటానికి అవకాశం కల్పించాలని శాంతమూర్తి కోరారు. స్పేస్ క్లబ్ దారా గత రెండు దశాబ్దాలుగా అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

పేదలకు ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తుంటే టిడిపి నాయకులు రైతుల చేత కోర్టులో కేసులు వేయిస్తున్నారని వైసిపి తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఆరోపించారు. బుదవారం భారత్‌పేటలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50,793 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని వీరికి ఇళ్ల నిర్మాణానికి ఈనెల 24న సిఎంజగన్ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.రాజధానిలో ప్రజలురాకుండా కేవలం చంద్రబాబు అనుకూల సంస్థలు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. ప్రజా రాజదాని అని ప్రకటించిన చంద్రబాబు ఇతర ప్రాంతాల వారిని రాజధాని గ్రామాల్లో రానివ్వకపోతే అభివృద్ధి ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. 2014 నుంచి 2019 మధ్య ఇతర ప్రాంతాలకు చెందిన 100 కుటుంబాలు కూడా రాజధానికి రాలేదన్నారు. రాజధాని అంటే పేద,మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలు కూడా ఉండాలని అంతేగానీ కార్పొరేట్‌సంస్థలకే అవకాశం కల్పిస్తామని చెబితే ఎప్పటికి అభివృద్ధి చెందుతుందన్నారు. 25 కాలనీల్లో 50వేల కుటుంబాలు నివశిస్తే అమరావతి వేగంగా అభివృద్ధి చెందుతుందని పేద వారు లేకుండా అమరావతి ఎప్పటికి అభివృద్ధి చెందదని అన్నారు. దేశంలో అన్ని రాజధానుల్లో అన్ని తరగతుల ప్రజలు నివశిస్తుండగా అమరావతిలో కొందరికే అవకాశం అంటూ చంద్రబాబు కొత్తపల్లవి అందుకోవడం వల్లే 2019లో రాజధానిలో పరిధిలోని అన్ని నియోజకవర్గాలో టిడిపి ఓటమి పాలైందన్నారు. పేదలను, దళితులు, బిసిలను, విస్మరించిన పార్టీలకు పుటగతులండవన్నారు.


మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్